క్లుప్తంగా

డాక్టర్ రామకృష్ణకు నివాళి



తెనాలిరూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) తెనాలి శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ కన్నెగంటి వెంకట రామకృష్ణ సంస్మరణ సభను నిర్వహించారు. బోసురోడ్డులోని ఐఎంఏ తెనాలి శాఖ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొని డాక్టర్ రామకృష్ణ సేవలను స్మరించుకున్నారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్ జి. మధు ప్రభాకర్‌బాబు, డాక్టర్ కె.అనిల్‌కుమార్, డాక్టర్ గోగినేని ఉయ, డాక్టర్ గోగినేని లక్ష్మీప్రసాద్, డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, డాక్టర్ ఉమా మహేశ్వరావు, డాక్టర్ వెంకట రెడ్డి, డాక్టర్ ఓకే మూర్తి, డాక్టర్ సాంబశివరావు తదితర వైద్యులు పాల్గొన్నారు.

డాక్టర్ జీవనలత సేవలు శ్లాఘనీయం



తెనాలి: వాసవీ క్లబ్ ఆఫ్ వనిత, ఆంధ్రా ప్యారిస్ తెనాలి ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్స్ డే వేడుకలను నిర్వహించారు. సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో పట్టణానికి చెందిన ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ డి.జీవనలతను సత్కరించారు. సమాజంలో వైద్యుల ప్రాముఖ్యతను ఐఈసీ కోళ్లపూడి కల్యాణి వివరించారు. డాక్టర్ జీవనలత అందిస్తున్న వైద్యసేవలు గొప్పవని చెబుతూ, వైద్య వృత్తితో పాటు మానవతా దృక్పథంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఎందరికో సాయపడుతుండటం గొప్ప విషయమన్నారు. క్లబ్ అధ్యక్షురాలు జి.లీలారాణి పర్యవేక్షించారు. క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి



కొరిటిపాడు(గుంటూరు): రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని వ్యవసాయశాఖ గుంటూరు సహాయ సంచాలకులు ఎం.సునీల్ సూచించారు. రైతులకు నాసిరకం, కల్తీ విత్తనాలు అంటగడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్నంబజారులోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల షాపులను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. లైసెన్స్‌లు, స్టాకు రిజిస్టార్లు తనిఖీ చేసి గోడౌన్లలోని నిల్వలను పరిశీలించారు. పలు షాపుల్లో స్టాక్ బోర్డు, ధరల పట్టిక లేనందున, సరిగా అప్‌డేట్ చేయనందున రూ.11.71 లక్షల విలువ చేసే 2,125 లీటర్ల పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఏడీఏ సునీల్ మాట్లాడుతూ రికార్డులు సక్రమంగా నిర్వహించకుండా, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల అమ్మకంపై రికార్డులు నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, నాసిరకమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అమ్మితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఆర్‌పీ మించి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ఒకటికి రెండు సార్లు పరిశీలించి కొనుగోలు చేయాలన్నారు. తనిఖీల్లో గుంటూరు రూరల్ ఏఓ వి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

4న విద్యా సంస్థల బంద్

లక్ష్మీపురం: నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ విద్యార్థి సంఘాలు ఈ నెల 4న దేశంలోని అన్ని విద్యా సంస్థల బందుకు పిలుపునిచ్చినట్లు ఎస్ఎఫ్ఐ గుంటూరు జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ పేర్కొన్నారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో సోమవారం పలు విద్యార్థి సంఘాలు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. నీట్ రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలని, జీఓ నంబరు 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలన్నారు. వీటితో పలు డిమాండ్లతో జూలై 4న దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ బంద్‌లో విద్యార్థులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాజర్ జి, ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కరీం విద్యా విధానంలో కేంద్రం వైఫల్యాలపై తమ గళం వినిపించారు. బంద్‌కు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ సమీర్, నాయకులు యశ్వంత్, భగత్‌సింగ్, పద్మ, రూపస్, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి శశి, అజయ్, బన్నీ, ఎస్ఎస్‌యూఐ నాయకులు తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ప్రారంభమైన పింఛన్ల పంపిణీ

- రెండు గంటల పాటు సర్వర్ నిలిచిపోవటంతో పంపిణీలో జాప్యం
- తొలిరోజు 95 శాతం పంపిణీ పూర్తి

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో పింఛన్ పంపిణీ సోమవారం ఉదయం 6 గంటలకు ప్రారంభమైంది. సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం పెంచిన రూ.4వేలతో పాటు గత మూడు నెలలకు సంబంధించిన రూ.3 వేలను కలిపి లబ్ధిదారులకు అందజేశారు. ఉదయం 8 గంటల నుంచి సుమారు 10 గంటల వరకు సర్వర్ నిలిచిపోవడంతో పంపిణీ తాత్కాలికంగా ఆగింది. సర్వర్ పని చేయడం ప్రారంభం కాగానే ఉద్యోగులు పింఛన్ల పంపిణీని పునః ప్రారంభించారు. తెనాలి పట్టణంలోని 47 సచివాలయాల పరిధిలోని 15,491 మందికి రూ.10,66,53,000లు నగదును పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. సాయంత్రం 6 గంటల సమయానికి సుమారు 95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తినట్లు అధికారులు తెలిపారు.

సర్వర్ మొరాయించడంతో ఇక్కట్లు

కొల్లిపర: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలిసారిగా సోమవారం ఇంటి వద్దనే సచివాలయ సిబ్బంది అధికారులతో కలసి పింఛను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 7 గంటలకు పంపిణీ కార్యక్రమం నిర్వహించిన అధికారులు 10 మంది లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేయగానే ఒక్క సారిగా ఆన్‌లైన్‌లో సర్వర్ పనిచేయక పోవడంతో పింఛనుదారులు ఇబ్బందులు పడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన విధంగా తెల్లవారు జామునే ఇంటికి పింఛన్ వస్తుందని అవ్వాతాతలు, ఇతర పింఛనుదారులు భావించారు. తీరా పంపిణీ సమయంలో ఆన్‌లైన్‌లో సర్వర్ పనిచేయటం లేదని అధికారులు వెల్లడించటంతో అప్పటి వరకు ఆనందంగా ఉన్న వీరంతా నిరుత్సాహానికి గురయ్యారు. ఎంపీడీవో బి.వై విష్ణుప్రసాద్ మాట్లాడుతూ మండలంలో 9,864 పింఛను లబ్ధిదారులు ఉన్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సర్వర్ మొరాయించిందని అన్నారు. 12 గంటల తరువాత అధికారులు, సిబ్బంది త్వరితగతిన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి సాయంత్రం 6 గంటల వరకు పింఛన్ పంపిణీ చేయటం జరిగిందన్నారు. మండలంలో 85 శాతం పింఛను పంపిణీ పూర్తి చేసినట్లు తెలిపారు.



24వ వార్డులో పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది



కొల్లిపరలో ఇంటి వద్ద పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీడీవో విష్ణుప్రసాద్, అధికారులు



తెనాలి హెల్త్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగికి పింఛన్ అందిస్తున్న ఉద్యోగులు



సర్వర్ మొరాయించడంతో అసహనం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

8, 9 తేదీల్లో రాష్ట్ర స్థాయి ప్రథమ నాటికల పోటీలు

తెనాలి: ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్, రోటరీ కళాపరిషత్, తెనాలి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 8, 9 తేదీల్లో తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో రాష్ట్రస్థాయి ప్రథమ నాటికల పోటీలను నిర్వహించనున్నారు. ట్రస్ట్ కార్యాలయంలో సోమవారం నాటికల పోటీల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి రొటేరియన్ గుత్తా వెంకటరత్నం, ఈదర వెంకట పూర్ణచంద్‌లు వివరాలను తెలియజేశారు. పోటీల సందర్భంగా రోటరీలో విశేష సేవలను అందించిన పీఈజీ అన్నే రత్నప్రభాకర్‌కు రోటరీ వ్యవస్థాపకుడు పాల్ హారీస్ పేరుతో ఇచ్చే అవార్డును 8వ తేదీ సాయంత్రం జరిగే సభలో అందజేస్తామని తెలిపారు. పావులూరి రాంబాబు, కాకుమాను ఉపేంద్ర, గుమ్మిడి ప్రసాద్, దేవయుజనం మురళీకృష్ణ, పూసపాటి మాలకొండయ్య, మంచాల సురేష్, నల్లూరి వెంకటేశ్వరరావు, మహేష్ పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన వెంకటరత్నం, పూర్ణచంద్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

తెనాలిఅర్బన్: పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని విశ్రాంత జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమా మహేశ్వర్, భీమవరపు శివరామకృష్ణలు పేర్కొన్నారు. బీసీ కాలనీలోని వేజళ్ల వెంకట సుబ్బారావు ప్రత్యేక ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు వేజళ్ల వెంకట సుబ్బారావు స్మారక విద్యాట్రస్ట్ ఆధ్వర్యంలో నోటుబుక్స్, పెన్నులు, కలర్ క్రేయాన్స్, గుడ్డ సంచులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులు ఉపయోగించవద్దని సూచించారు. అనంతరం పర్యావరణ పరిక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తారని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వేజళ్ళ నవ్య, భీమవరపు శివరామకృష్ణ, సీఆర్‌పీ శ్రీదేవి, విశ్రాంత ఉద్యోగి టిఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో దాతలు ఉమామహేశ్వర్, నవ్య

కొత్త చట్టాల అమలు నిలిపివేయాలి

తెనాలిరూరల్: కేంద్రం అమల్లోకి తీసుకొచ్చిన కొత్త చట్టాలను నిలిపి వేయాలని ఆటో డ్రైవర్లు, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. చట్టాలను వ్యతిరేకిస్తూ తెనాలి గంగానమ్మపేట ఆటో పాయింట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా నాయకుడు కొల్లిపర బాబు ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వ విధానాలు వల్ల రవాణా రంగం కుదేలైందని, పెట్రోలు డీజిల్, గ్యాస్, స్పేర్ పార్టుల ధరలు విపరీతంగా పెరిగాయని వాపోయారు. అదనంగా పర్మిట్లు, బీమా, టోల్ టాక్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ సెస్, వాహన స్క్రాపింగ్ పేరుతో యజమానులను, డ్రైవర్లను తీవ్ర ఇబ్బందులకు గురి చేయడమే ఈ చట్టాల ఉద్దేశంగా కనబడుతోందన్నారు. ఆటోమొబైల్ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. వెంటనే చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో వర్కర్స్ యూనియన్ నాయకుడు సాంబశివరావు, కార్యవర్గ సభ్యుడు దుర్గాప్రసాద్, షబ్బీర్, సంజయ్, గోపి, మాధవరావు, కోటేశ్వర రావు, శ్రీనివాసరావు, కోటీ రెడ్డి, పఠాన్ భాషా, నాగార్జున, దుర్గాప్రసాద్, వేంకటేశ్వరరావు, మోహన్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు, సీఐటీయూ నాయకులు

దేశ ఆర్థిక ప్రగతిలో సీఏల పాత్ర కీలకం

ఘనంగా సీఏ దినోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ ఆర్థిక ప్రగతిలో చార్టర్డ్ అకౌంటెంట్ల పాత్ర ఎంతో కీలకమని చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు పేర్కొన్నారు. శ్రీనివాసరావు తోటలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) గుంటూరు శాఖ ఆధ్వర్యంలో సోమవారం సీఏ దినోత్సవం సందర్భంగా పతాక ఆవిష్కరణ, రక్తదాన శిబిరం, మొక్కల పంపిణీ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ సీఏ విద్యను ఎంపిక చేసుకోవడం బంగారు భవిష్యత్తుకు పునాది వేసుకోవడమన్నారు. సీఏ విద్యకు గుంటూరు ముఖ్య కేంద్రంగా ఉందని చెప్పారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఎంతో మంది విద్యార్థులు సీఏ అభ్యసించేందుకు ఇక్కడికి వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీఏఐ గుంటూరు శాఖ చైర్మన్ నూతలపాటి అమర్‌నాథ్, వైస్ చైర్మన్ చింతా రఘునందన్, కార్యదర్శి రుద్రవరపు భరద్వాజ, కోశాధికారి నరేష్, సికాస చైర్మన్ కన్నెగంటి మృత్యుంజయరావు, పాస్ట్ చైర్మన్ మద్ది రవితేజ, కమిటీ సభ్యురాలు వంగల భార్గవి, సీఏలు, విద్యార్థులు పాల్గొన్నారు.



సీఏ దినోత్సవంలో ఐసీఏఐ ప్రతినిధులు

అత్యుత్తమ వైద్య సేవలందించిన బిధాన్ చంద్రరాయ్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉత్తమ వైద్య సేవల కోసం కృషి చేసిన బిధాన్ చంద్రరాయ్..దేశం కోసం తన జీవితాని అర్పించారని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్‌పీ స్కూల్లో సోమవారం పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం, భారత రత్న డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ జయంతి సందర్భంగా జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వైద్యుల వస్త్రధారణతో అలరించారు. డాక్టర్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ రెండవ సీఎంగా పని చేసిన డాక్టర్ బీసీ రాయ్ గొప్ప రాజకీయవేత్త, స్వాతంత్ర్య సమరయోధుడన్నారు. చిత్తరంజన్ సేవా సదన్ పేరుతో ఆస్పత్రిని ఏర్పాటు చేసి, వైద్య సేవలు అందించారని కొనియాడారు. ఈ సందర్భంగా నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవపున్నయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ వై.రథినీచౌదరి, ఏవో కె. వెంకట్రావు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



విద్యార్థులతో డాక్టర్ కృష్ణప్రసాద్, ఉపాధ్యాయులు

మీ కోసం కార్యక్రమంలో ఒక ఫిర్యాదు

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో ఒక ఫిర్యాదు వచ్చినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. పట్టణంలోని అక్రమ కట్టడాలకు సంబంధించిన ఫిర్యాదు వచ్చిందన్నారు. దీనిపై చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ బండి శేషన్న, పలువురు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రేపు కేర్ టేకర్స్ నియామకానికి ఇంటర్వ్యూలు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివ పేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలకు అనుబంధంగా ఉన్న విద్యార్థినుల వసతి గృహంలో కేర్ టేకర్స్ పోస్టులకు ఈ నెల 3న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ఆపై విద్యార్హతలు కలిగిన మహిళా అభ్యర్థులు బుధవారం ఉదయం 10 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు ఆకర్షణీయమైన వేతనంతో పాటు ఉచిత భోజన, వసతి కల్పిస్తామని తెలిపారు.

డీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ

నెహ్రూనగర్: ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ- 2024 పరీక్షలకు సన్నద్ధమయ్యే బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ డి.మధుసూదనరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టెట్ క్వాలిఫై అయిన 200 మంది అభ్యర్థులకు రెండు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ కూడా ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పదో తరగతి, టీటీసీ, బీఎడ్ మార్క్ లిస్టులు, టెట్ మార్క్ లిస్టులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం లక్ష లోపు, ఆధార్, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జత చేసి జూలై 7వ తేదీలోగా రాజాగారితోటలోని బీసీ స్టడీ సర్కిల్, గుంటూరు కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 0863-2358071 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

చరిత్రను తిరగరాసిన టీం ఇండియా

లక్ష్మీపురం: పదిహేడేళ్ల తపన టీ20 వరల్డ్ కప్ విజయంతో తీరిందని, తిరుగు లేని టీం ఇండియా విజయం దేశానికి గర్వకారణమని గాయకుడు వీఎస్ఎన్ మల్లేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. టాస్ గెలవడం శుభారంభమైతే.. భారీ స్కోరు భారత్ విజయానికి సంకేతమన్నారు. సంస్థ సీనియర్ సభ్యులు ఎల్.మురళీకృష్ణ, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ టన్నుల కొద్దీ టాలెంట్ ఉన్నా అందకుండా ఊరిస్తున్న టీ20 టైటిల్ టీం ఇండియా దరి చేరిందన్నారు. టీం ఇండియాకు సంస్థ తరుపున అభినందనలు తెలిపారు.

స్థానిక సంస్థలో బీసీలకు 34శాతం రిజర్వేషన్ కొనసాగించాలి



నెహ్రూనగర్: జనాభా దామాషా ప్రకారం బీసీలకు స్థానిక సంస్థల్లో 34శాతం రిజర్వేషన్లు కొనసాగించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ కుల జనగణన చేపట్టి స్పష్టీకరించాలని కోరారు. ప్రస్తుత గణాంకాల ప్రకారం బీసీ లు 52% శాతంగా ఉన్నారని.. ఈ దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలలో 34% శాతం రిజర్వేషన్‌ను అమలు పరచాలన్నారు. బీసీల పక్షపాతి, బీసీల ప్రభుత్వం అని చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో బీసీలకు అండగా ఉండాలని కోరారు. టీడీపీ ప్రభుత్వం ఈ రిజర్వేషన్‌పై ఒక కమిటీ వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, పూర్ణ చంద్ర, గోపి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండండి

సహాయ మలేరియా అధికారి ప్రభాకర్‌రెడ్డి

తెనాలిఅర్బన్: డెంగీవ్యాధి పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా సోమవారం చినరావూరులో ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా జులై మాసాన్ని డెంగీ వ్యతిరేక మాసంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. మాసోత్సవాల్లో దోమ కాటు వలన సంక్రమించే వ్యాధులు, వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ప్రజా భాగస్వామ్యంతో డెంగ్యూను అరికట్టవచ్చని తెలిపారు. సబ్ యూనిట్ మలేరియా అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమల వ్యాప్తికి నీటి నిల్వలే కారణమని చెప్పారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు, పూర్తి వస్త్రధారణ కలిగి ఉండటం చేయాలన్నారు. ప్రతి శుక్రవాన్ని డ్రైడేగా పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాల చంద్రమౌళి, వంగాల పున్నారెడ్డి, డాక్టర్ పాల్‌రాజు కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కరస్పాండెంట్ పి.రాధిక, సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ జి.రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

'మా అబ్బాయి మృతిపై నిజానిజాలు తేలాలి'

- మృతి చెందిన తెనాలి విద్యార్థి ఆదిత్య తల్లిదండ్రుల డిమాండు
- కేసును తెనాలి పోలీసులు నీరు గారుస్తున్నారని ఆరోపణ
- అనుమానితుల పేర్లు చెప్పినా విచారణ చేపట్టలేదు
- డిప్యూటీ సీఎం, హోం మంత్రికి లేఖ రాసిన మృతుడి తల్లిదండ్రులు

డాబాగార్డెన్స్(విశాఖపట్నం): తమ కుమారుడి అనుమానాస్పద మృతిపై పోలీసులు సరిగ్గా స్పందించడం లేదని, మృతి చెంది దాదాపు ఆరు నెలలు కావస్తున్నా పోస్టుమార్టం రిపోర్టుతో పాటు సెల్‌ఫోన్ కూడా ఇవ్వకుండా కేసును నీరుగారుస్తున్నారని గుంటూరు జిల్లా కొల్లిపర మండలం దావులూరు గ్రామానికి చెందిన బేతాళ విద్యావతి, బేతాళ రవిచంద్ర 'సాక్షి' వద్ద వాపోయారు. మా అబ్బాయి మృతిపై నిజానిజాలు తేలాలని, అనుమానితుల పేర్లు చెప్పినా విచారణ చేపట్టకపోవడంపై తమకు అనుమానాలున్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. తమ కుమారుడు ఆదిత్య తెనాలిలో ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాలలో చదువుతూ జనవరి 7వ తేదీ అర్ధరాత్రి నుంచి కనిపించకుండా పోయాడని, 10వ తేదీన చెరువు వద్ద మృతదేహం లభ్యమైందని చెప్పారు. మా అబ్బాయి సెల్‌ఫోన్ కూడా తీసుకున్నారని, ఇంతవరకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చెముడుబాడు గ్రామానికి చెందిన గళ్ల బాబీతో చివరి సారిగా ఫోన్‌లో మాట్లాడినట్టు ఉందని, అనుమానితుల పేర్లు చెప్పినా పోలీసులు దర్యాప్తు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తెనాలి సీఐ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోగా మీరు చెప్పిన వారందర్నీ పిలిపించి అడగాలా? అని ప్రశ్నించారని తెలిపారు. సహచరి విద్యార్థినితో మా అబ్బాయికి పరిచయం ఏర్పడిందని, ఆ విషయంలో కస్తూరి సాయి అనే వ్యక్తి వార్నింగ్ ఇచ్చినట్టు విద్యార్థుల ద్వారా తెలుసుకున్నామన్నారు. ప్రస్తుతం తమ కుటుంబం విశాఖలోనే నివాసముంటుందని, తమకు న్యాయం చేయాలని కోరారు. తమ కుమారుని మృతిపై నిజానిజాలు తేల్చాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోం మంత్రి అనితకు లేఖ పంపినట్టు తెలిపారు.

జన ఔషధి కేంద్రంలో డాక్టర్స్ డే

ప్రముఖ వైద్యులకు సత్కారం

తెనాలి: పీఎంబీఐ ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ అయితానగర్‌లోని పేరంటాలమ్మ గుడి దగ్గర్లోని జనఔషధి కేంద్రంలో ఏర్పాటైన సభకు మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి అధ్యక్షత వహించారు. పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ నందిపాటి శివరామ్‌ప్రసాద్ , డాక్టర్ పాటిబండ్ల వేణుగోపాల్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, డాక్టర్ మల్లపురాజు సింగంరాజు, డాక్టర్ ఆవుల చక్రవర్తి, డాక్టర్ గుమ్మడి సాంబశివరావు, డాక్టర్ నన్నపనేని ప్రతాప్‌ను సత్కరించారు. జనఔషధి రాష్ట్ర నోడల్ ఆఫీసర్ హరికృష్ణ పర్యవేక్షించారు. వైద్యులు ప్రాణదాతలని, కరోనా లాంటి విపత్కర పరిస్థితులను కూడా దాటుకొని జీవిస్తున్నామంటే అందుకు వైద్యుల సేవలే కారణమని వక్తలు కొనియాడారు. నిరుపేదలకు నాణ్యమైన మందులను తక్కువ ధరల్లో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ జనఔషధీ కేంద్రాలను ఏర్పాటు చేయటం ముదావహమన్నారు. కార్యక్రమ నిర్వాహకురాలు డాక్టర్ అంచ లక్ష్మి తులసిని అభినందించారు. ఈదర పూర్ణచంద్, పాటిబండ్ల రామకృష్ణ, కటారి వాసుదేవ నాయుడు, టి.అనంతాచారి, అడపా సంపత్‌రాయుడు, మైల హరికృష్ణ, బిట్రా కనకదుర్గ, గాన కళావతి, ప్రశాంతి పాల్గొన్నారు.



సత్కార గ్రహీతలతో అతిథులు

కంటి వ్యాధులపై నిర్లక్ష్యం తగదు

నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ పద్మప్రియ

లక్ష్మీపురం: పంచేంద్రియాలలో అతి ముఖ్యమైన నయనం విషయంలో అప్రమత్తంగా ఉండాలని, కంటి వ్యాధులపై నిర్లక్ష్యం తగదని నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ పద్మప్రియ అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఆరోగ్య సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నలభై ఏళ్ల పైబడిన వారు కంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమస్యలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని కోరారు. శుక్లాలు, నీటి కాసుల వ్యాధులు ఈ మధ్య చాలా ఎక్కువగా వస్తున్నాయన్నారు. చూపుకి అడ్డు పడి చికాకు కలిగించే ఫ్లొటర్స్ సమస్య ఉన్నప్పుడు మాత్రం డాక్టర్‌ని సంప్రదించాలన్నారు. ఆకు కూరలు, పండ్లు వంటివి తీసుకోవడం వల్ల కంటి చూపు మెరుగ్గా ఉంటుందని వైద్యురాలు వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ పద్మప్రియను ఘనంగా సత్కరించారు.



ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్న డాక్టర్ పద్మప్రియ

దంత వైద్యుల పోస్టులను భర్తీ చేయాలి

ఏపీ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సతీష్

గుంటూరు మెడికల్: జనాభాకు అనుగుణంగా డెంటిస్టుల నియామకాలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కృష్ణాపురపు సతీష్ కోరారు. సోమవారం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కోవిడ్‌లాంటి అత్యవసర సమయంలో రోగుల ప్రాణ రక్షణ కోసం అన్ని విభాగాలతో పాటు డెంటిస్టులు విభాగం కూడా ఉన్నతమైన వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. అప్పటి ప్రభుత్వం మిగిలిన విభాగాలకు ఇచ్చినట్లు సర్వీస్ వైటేజ్ ఇచ్చి వారికీ ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని వివరించారు. రాష్ట్ర నాయకులు గౌరీ శంకర్ మాట్లాడుతూ కోట్ల సంఖ్యలో జనాభా ఉంటే వారి దంతరక్షణ చేసే వైద్యుల సంఖ్య కేవలం పదుల సంఖ్యలో ఉందని ప్రభుత్వాస్పత్రుల్లో కొన్నిచోట్ల డెంటిస్టులు కూడా అందుబాటులో లేరని తెలిపారు. ప్రస్తుతం ఏర్పడిన నూతన ప్రభుత్వం దంత వైద్యులపై వారి సేవలపై దృష్టి సారించి శాశ్వత నియామకాలు చేపట్టాలని, ప్రస్తుతం ప్రభుత్వ పరిధిలో విధులు నిర్వహిస్తున్న డెంటిస్టులకు సకాలంలో ప్రమోషన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీహర్ష, రాష్ట్ర కార్యదర్శి ఆనంద ప్రసాద్, హిమబిందు, హిమస్ విష, నాగవాణి, హరినాథ్, నరేష్ వెంకటరెడ్డి, గోపి, రైసా, ఉదయ్ పాల్గొన్నారు.